# అవార్డ్

కౌంటర్‌లో చెక్కు ఇచ్చి టోకెన్ తీసుకున్నాను. పేమెంటుకి మరింత సమయం పట్టేలా ఉంది. ఈలోగా టీ వగైరాలు కానిచ్చేస్తే బావుంటందనుకున్నాను. అప్పటికే టీస్టాలు ముందు ఐదారుగురు ప్రధానోపాధ్యాయులు గుమిగూడి ఉన్నారు. సంబంధిత సబ్ ట్రెజరీ పరిధిలోని హైస్కూల్ హెడ్మాస్టర్లంతా ప్రతి ఫస్టు తారీఖున శాలరీ ఎన్‌క్యాష్ మెంట్ నిమిత్తం విధిగా ఇక్కడికొస్తారు. ఒకరి సమస్యలు మరొకరితో చెప్పుకోడానికి మా అందరికీ ఆ బ్యాంకు ఓ వేదికలా ఉపయోగవడుతోంది.

"నమస్కారాలు" చేతులు జోడిస్తూ అన్నాను వాళ్ళ దగ్గరకెళ్ళి.

"మీకీ విషయం తెలుసా?. . . వంశీకి నేషనల్ అవార్డు వచ్చిందట" అన్నారు పాత్రో గారు.

"కంగ్రాట్స్" అనబోతూ ఉండగా నా మాటకు అడ్డుపడుతూ "పాత్రోగారన్నదానికి చిన్న సవరణ. . . అవార్డు వచ్చిందనేకంటే తెచ్చుకున్నాడంటే బావుంటుంది" రెండో పదం కాస్త వత్తి పలుకుతూ అన్నారు జోసెఫ్ గారు.

ఈ అవార్డుల మీద నాకూ సదభిప్రాయం లేదు. అందుకే నర్మగర్భంగా నవ్వి ఊరుకున్నాను.

కాసేపు ఆ టాపిక్ మీద చర్చ జరిగింది. అనంతరం క్యాష్ తీసుకుని అంతా హడావిడిగా అక్కడ నుండి నిష్క్రమించాం.

"ఏటా టెన్త్‌లో నైంటీ పర్సెంట్ సాధిస్తున్నాం. అయినా మన ప్రతిభను ఎవరూ గుర్తించడం లేదు" అన్నారు సైన్సు మాస్టారు జీతాలు డిస్బర్స్ చేస్తూ. ఆయన




మాటల్లో నిరాశా నిస్పృహలు ధ్వనిస్తున్నాయి.

"అవార్డుల ఎంపికకు పరీక్షా ఫలితాలొక్కటే కొలమానం కాదు మాస్టారూ. వంశీకి నేషనల్ అవార్డు వచ్చిందంటే ఆయన్లో ఇంకేం ప్రత్యేకత లున్నాయో!" అన్నాను కాస్త వ్యంగ్యంగా.

ఆ రాత్రి పడుకున్నానన్న మాటేగాని రెప్పపడటం లేదు. నా మెదడు వంశీ చుట్టూ పరిభ్రమిస్తోంది. వాడు బి. ఇడి.లో నా క్లాస్‌మేటు. చదువవుతూనే ఇద్దరం ఒకేసారి ఉద్యోగంలో చేరాం. హెచ్.ఎమ్‌గా ప్రమోటయి ఐదేళ్ళవుతోంది. నేషనల్ అవార్డు. సాధించగలిగినంత ఘనకార్యాలతడేం చేశాడన్న ప్రశ్న మస్తిష్కాన్ని కుమ్మరి పురుగులా దొలిచేస్తోంది. వాడు పనిచేసేది ఓ మారుమూల గ్రామంలో ఉన్న అతి చిన్న స్కూలు. అక్కడ ఇతగాడు చేయగలగిందే ముంటుంది? పోనీ వాడికి రాజకీయ పలుకుబడిగానీ అధికారుల అండదండలుగానీ ఉన్నాయేమో అనుకుంటే నాకు తెలిసినంతవరకు అటువంటి దాఖలాలేవీ కానరావడం లేదు. మరి అత్యున్నతమైన ఆ అవార్డు ఎలా వచ్చింది?. . . ఎలా వచ్చిందో అక్కడకెళ్ళి చూసొస్తేగాని తెలీదు

అనుకోవడమే తడవుగా రెండ్రోజులు సెలవుపెట్టి వంశీ పనిచేసే ఊరికి ప్రయాణంకట్టాను. ఓ యాభై కిలోమీటర్లు బస్సులోను, మరో ఐదు కిలోమీటర్లు కాలికి బుద్ధిచెప్పి ఎలాగో ఆపసోపాలు పడుతూ అక్కడికి చేరుకున్నాను.

మెయిన్‌గేటు తోసుకుని లోపలకు అడుగుబెట్టడం తోనే దారిపొడవునా క్రోటన్సు, వివిధ రకాల పూల మొక్కలు దర్శనమిచ్చాయి. పరిసరాలు కడిగి కల్లాపు జల్లినట్లున్నాయి. వంశీగాడు మొక్కల్ని బాగానే పెంచాడనుకున్నాను లోలోపల. ఔను, వాడి స్కూలుకి ప్రహరీగోడ ఉంది. జంతువులు జొరబడే అవకాశం లేదు. మా స్కూలుకి కూడా కాంపౌండువాలుంటే వీడి కంటే ఎక్కువ మొక్కల్ని పెంచి ఉండేవాణ్ణి. ప్రహరీ గోడ కోసం జన్మభూముల్లో పల్లెబాటల్లో ఎన్ని వినతి పత్రాలు సమర్పించానో.... ప్రభుత్వం సహకరిస్తేనా?. . .

వంశీ నా రాకను పసిగట్టినట్లుంది. గదిలోంచి బయటకొచ్చినా చేతులు పుచ్చుకుని ఆప్యాయంగా పలకరించాడు. తన స్టాఫ్ అందర్నీ పరిచయం చేశాడు. స్కూలంతా చూపించాడు. లైబ్రరీ, లేబొరేటరీ, స్టాఫ్‌రూం, నిట్ సహకారంతో నడుస్తున్న కంప్యూటరు రూము. . . ఇలా అన్ని హంగులూ ఉన్నాయి ఆ పాఠశాలకి. ఒక్క కంప్యూటరు గది మినహాయిస్తే మిగిలినవన్నీ మా స్కూల్లోనూ ఉన్నాయి. అంతమాత్రాన వాడి గొప్పేముంది?

"మీకు నాన్‌టీచింగ్‌స్టాఫ్‌ఎవరూలేరన్నమాట" అన్నాను సిబ్బంది వివరాల పట్టిక వంక చూస్తూ.

"లేరు. ఆఫీసు పని కూడా టీచర్సే చేస్తారు. అదుగో ఆ అవ్వ బెల్ కొడుతుంది. క్లాసు క్లాసుకి హాజరు పుస్తకాలు పట్టుకెళ్ళి ఇస్తుంది. మేమంతా కంట్రిబ్యూట్ చేసి ఎంతో కొంత మొత్తం ఆమెకు చెల్లిస్తుంటాం. మీది చాలా పెద్ద స్కూలు. నీకీ అవస్థలేవీ ఉండవనుకుంటాను" అన్నాడు వంశీ.

జవాబుగా నవ్వి ఊరుకున్నాను. వీడి స్కూలుకి నా స్కూలుతో పోలికేమిటి? నక్కకీ నాగలోకానికీ ఉన్నంత తేడా ఉందనుకున్నాను మనసులో.

"సునామీ బాధితుల కోసం పిల్లలు రెండువేల రూపాయలు పోగుచేసి పట్టుకొచ్చారు. ఈ డబ్బు ఏం చేయమంటారు?" అని అడిగారు డ్రాయింగ్ మాస్టారు.

"వెంటనే ఆ మొత్తం సి.ఎం రిలీఫ్ ఫండ్‌కి డ్రాఫ్ట్ తీసి పంపించండి" అన్నాడు వంశీ.

విద్యార్థులలోని క్రమశిక్షణనూ హెచ్.ఎమ్.తో కలిసి పోయి పనిచేసే టీచర్స్‌నీ చూస్తుంటే నాకు ఆశ్చర్యంతోపాటు అసూయ కూడా కలిగింది. వాళ్ళంతా సహకరించబట్టే వంశీ ఇక్కడ నెగ్గుకు రాగలుగుతున్నాడు. నాకు కూడా అటువంటి మంచి స్టాఫ్ ఉంటే వీడికంటే ఎక్కువ ఘనకార్యాలు చేసి ఉండేవాణ్ణి.

లాంగ్ బెల్ అయింది.

లంచ్‌కి నన్ను మా ఇంటికి తీసుకెళతామంటే. . . మా ఇంటికి తీసుకెళతామంటూ పోటీ పడుతున్నట్లున్నారు టీచర్స్.

"వద్దు. వీడు నా బాల్యమిత్రుడు. వీడిని నా రూంకి తీసుకెళతాను" అన్నాడు వంశీ నా భుజంమీద చెయ్యివేస్తూ.

"నువ్వు క్యారేజి తెచ్చుకోవా?" అడిగాను ఆశ్చర్యంగా.

"ఊహుఁ. . . పొద్దున్నే వంట చేసుకుని స్కూలు కొచ్చేస్తాను."

"అంటే నువ్విక్కడే నివాసముంటున్నావన్నమాట" అన్నాను కళ్ళు పెద్దవి చేస్తూ.

"నేనే కాదు. మా ఉపాధ్యాయులంతా ఇక్కడే ఉంటున్నారు" అన్నాడు వంశీ.

ఉండక ఏం చేస్తారు. చచ్చినట్లు ఉంటారు. మరోచోటి నుండి ఈ అడవిలోకి రావాలంటే మజాకా! గత్యంతరంలేని స్థితిలో అలా చేస్తున్నారే తప్ప ఏమాత్రం అవకాశం ఉన్నా చెక్కేయరూ!

నన్ను నేను సమర్థించుకోవడం కోసం అలా అనుకున్నా వాస్తవానికిది విశేషంగా చెప్పుకోదగ్గదే. పని చేసేచోటే నివాసం ఉండాలన్న ప్రభుత్వ ఉత్తర్వుని ఎంతమంది పాటిస్తున్నారీ రోజుల్లో? నిజంగా వచ్చి పోవాలనుకుంటే బస్సులే ఉండనక్కర్లేదు. మోటారు సైకిళ్ళ పైనైనా రాగలరు. ఆ స్టేటస్ నేడు పంతుళ్ళకు కూడా ఉంది. నిజం చెప్పాలంటే మా స్టాఫ్‌లో మూడొంతుల మందికి బళ్ళున్నాయి.

"ఫ్యామిలీ లేకుండా ఉంటున్నావు. నీకెలా ఊసు పోతుందిరా ఈ ఊళ్ళో? ఓ ఎమ్యూజ్‌మెంట్ పార్కు లేదు. సినిమా థియేటరు లేదు. కనీసం మంచి కాఫీ తాగడానికి సరియైన క్యాంటీను కూడా లేదు."

నా మాటకు వాడు ఏమనుకున్నాడో ఏమో చిరునవ్వు నవ్వుతూ "కాలక్షేపం కాకపోవడానికి నాకసలు టైం ఉంటేనా?" అన్నాడు.

"పెద్ద ప్రైమ్ మినిస్టర్‌లా మాట్లాడకు. స్కూలు అయిపోగానే నువ్విక్కడ చేసే పాటేమిటి? వండుకు తినడమే కదా!" ముఖం చిట్లిస్తూ అన్నాను కాస్త చిరాగ్గా.

"సారీ. నా టైం టేబిలు నీకు చెప్పలేదు కదూ! . . . సాయంత్రం వేళ ఇక్కడ ఏడు, పది తరగతులకు రెమిడియల్ క్లాసెస్ ఉంటాయి. సి.డి గ్రూపు విద్యార్థుల్ని మేమంతా దత్తత తీసుకుని చదివి స్తున్నాం. నా పర్యవేక్షణలో ఇక్కడ అరడజను ఓపెన్ స్కూల్ సెంటర్లు నడుస్తున్నాయి. రాత్రి ఎనిమిది గంటలకు ఆ కేంద్రాకు వెళ్ళి ఏ స్టేజి వాళ్లకు ఎలా చెప్పాలో సూచనలిస్తూ ఉంటాను. పోతే, తెల్లవారు జామున ఆరో గంటకే బడికి రావాలి. స్కౌట్‌లో ట్రైనింగ్ అయిన వాళ్ళెవరూ లేకపోవడంతో నేనే ఒక ట్రూపు రన్ చేస్తున్నాను. నాకు తోడుగా మా పి.ఇ.టి. వచ్చి ఎంపికచేసిన పిల్లలకి ఆటల్లో ట్రైనింగొ ఇస్తుంటాడు. మొన్న జరిగిన జిల్లా స్పోర్ట్స్ మీట్‌లో రోలింగ్ షీల్డు మా స్కూలు కైవసం చేసుకుందని చెప్పడానికి నాకెంతో సంతోషంగా ఉంది"

అంటూ ఆగాడు వంశీ.

చెప్పుకుంటే సిగ్గు. . .  జిల్లాలో మాది పెద్ద స్కూలు. అయితేనేం మొన్నటి ఆటల పోటీల్లో ఒక్క కప్పు కూడా కొట్టలేకపోయింది. ఎన్నో వనరులు, అవకాశాలు ఉన్నా నేను చేయలేని పనులెన్నో. వంశీగాడు చేస్తున్నాడని తెలియడంతో నాకు వాడి ముందు తల తీసేసినట్లుంది. అసలు వీడు ఏ మంత్రం వేసి టీచర్స్‌ని గుప్పెట్లో పెట్టుకుని పని చేయించగలుగుతున్నాడో తెలుసుకోవాలనిపించింది. వంశీ మరేదో చెప్పబోతూ ఉంటే వాడి మాటకు అడ్డు తగులుతూ నా సందేహాన్ని వ్యక్తం చేశాను.

"పొగిడితే పనిచేసేవాళ్ళు కొందరైతే, బెదిరిస్తేగానీ పనిచేయనివాళ్లు కొందరుంటారు. ముందు మనం వాళ్ళ సైకాలజీ స్టడీ చేసి, అందుకు తగ్గట్టు ఆదేశాలు జారీ చేసుకుంటూపోతే సవ్యంగా అన్ని పనులూ జరిగిపోతాయి. నువ్వు అడిగావు గనక నా అనుభవాలు చెబుతాను విను" అంటూ చెప్పడం ప్రారంభించాడు వంశీ.

వినడం నా వంతైంది.

★ ★ ★

అసిస్టెంటుగా ఉన్నప్పటి నుండి వంశీ నిబద్ధతతో పనిచేస్తూ ప్రధానోపాధ్యాయుల ప్రశంసల్ని అందుకున్నాడు. నమ్ముకున్న వృత్తికి న్యాయం చేయాలన్న తపనతో అహర్నిశలూ కష్టపడి పనిచేసేవాడు. ఏ టీచరు సెలవు పెట్టినా మెమో వర్కుతో సంబంధం లేకుండా ఆ క్లాసు తీసుకునేవాడు. ఏటా తన సబ్జక్టులో పిల్లలు నూటికి నూరు శాతం కృతార్థులయ్యే వారు. ఆ కారణంగా అతడు విద్యార్థులందరికీ దేవుడయ్యాడు. పంక్చువాలిటీ అతడి ఊపిరని కొందరంటే. . .  సహనం అతడి నైజం అంటారు మరికొందరు. ఎవరు ఏమన్నా అతడందరికీ ఆరాధ్యుడు. అందులో సందేహం లేదు.

ఇలా ఉండగా కొన్నాళ్ళకు సీనియారిటీపై అతడికి ఓ మారుమూల గ్రామంలో హెడ్మాస్టరుగా ప్రమోషనొచ్చింది. రిలీవై ఆ ఊరు చేరుకునేసరికి పదిన్నరైంది. లేటుగా బడికెళ్ళడం ఇష్టంలేక మధ్యాహ్నం జాయినవుదామనుకున్నాడు. ఆ గ్రామంలో అంతా అపరిచితులు కావడంతో ఏం చేయాలో తోచక ఊరావతల యేటి ఒడ్డున కాలంగడిపి రెండవుతూ ఉండగా స్కూలుకొచ్చాడు.

బడి మూసేసి ఉంది. ఆరోజు సింగిల్ సెక్షన్ చేశారేమో అనుకుంటే కారణమేదీ కనిపించడం లేదు. చేసేదేంలేక ఉసూరుమంటూ కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళిపోయి మరునాడు ఉదయాన్నే వచ్చాడు. టైం పదవుతోంది. పిల్లలు ఒక్కొక్కరూ మెలమెల్లగా

వస్తున్నారు వారిలో ఓ పెద్ద కుర్రాడు గేటు తాళం తీశాడు.

వెంటనే లోపలకెళ్ళి రిజిస్టర్‌లో సైన్ చేసి కుర్చీలో కూర్చున్నాడు.

విద్యార్థులంతా వచ్చేశారు. టీచర్స్ జాడ మాత్రం కానరావడం లేదు.

"బాబూ! మీరు ప్రేయర్ ఎన్ని గంటలకు చేస్తారు?"తాళం తీసిన పెద్ద కుర్రాణ్ణి అడిగాడు ఉండబట్టలేక.

అదేమిటన్నట్లు వంశీ వంక వింతగా చూశాడా కుర్రాడు.

పరిస్థితి అర్థమైపోయింది వంశీకి.

పదకొండు అవుతూ ఉండగా కొందరు టీచర్సు మో పెడ్స్ మీద, మరికొందరు సైకిళ్ళ మీద వచ్చారు. వాళ్ళంతా చెప్పాపెట్టకుండా ప్రత్యక్షమైన ప్రధానోపాధ్యాయుణ్ణి చూసి అవాక్కైపోయారు.

"ఇదేనా రావడం మాస్టారు" వినయంగా అడిగాడు ఇన్‌ఛార్జి హెచ్.ఎంగా ఉన్న మాధవరావు.

''కాదు. నిన్ననే వచ్చాను. కొద్దిగా ఆలస్యమవడంతో ఆఫ్టర్‌నూన్ జాయినవుదామనుకున్నాను. తీరా మధ్యాహ్నం వచ్చేసరికి బడి మూసుంది. చేసేదేంలేక తిరిగి వెళ్ళిపోయి మళ్ళీ ఇప్పుడొచ్చాను'' విషయం వివరించాడు వంశీ.

"సారీ మాస్టారూ'' అంటూ టీచర్స్ అందరినీ పరిచయం చేశాడు మాధవరావు.

"నిన్న మధ్యాహ్నం బడిలేకపోవడానికి కారణం" అడిగాడు వంశీ."

"ఇక్కడ మధ్యాహ్నంపూట పిల్లలు రారు. అందుకే బడి మూసేస్తాం" ఠపీమని సమాధానమిచ్చాడు పి.ఇ.టి.

"స్కూలు తెరవడం, మూసేయడం అంతా మనిష్టమేనా?" అడిగాడు వంశీ.

"ఇలా ఎప్పటినుంచో జరుగుతోంది మాస్టారూ"

"సరే, ఇంతవరకు జరిగిందంతా మరచిపోండి. ఇక మీదట మధ్యాహ్నం బడి ఉంటుంది. సర్క్యులరు పంపిస్తాను. వెళ్ళి మీ పని చూసుకోండి." వంశీ ఆదేశానుసారం స్టాఫ్ అంతా అక్కడ నుండి వెళ్ళిపోయారు.

ఆరోజు మధ్యాహ్నం ఇష్టం ఉన్నా లేకున్నా టీచర్స్‌కి పనిచేయక తప్పలేదు. మరునాడు వంశీ వచ్చేసరికి సుమారు యాభైమంద గ్రామస్థులు బడి ముందు

గుమిగూడి ఉన్నారు. అందర్నీ ఓ గదిలో కూర్చోబెట్టి వారి రాకకు కారణం అడిగాడు వంశీ.

"మీరీ స్కూలుకి హెడ్మాష్టరుగా వచ్చారా?" అడిగాడు ఓ పెద్దమనిషి లేచి నిలబడి.

"ఔను. మీతో నేను ఎన్నో విషయాలు. మాట్లాడాలి. పిలవకుండానే మీరంతా ఇక్కడకు రావడం సంతోషం" కృతజ్ఞత నిండిన కళ్ళతో వాళ్ళ వంక చూస్తూ అన్నాడు వంశీ.

గ్రామస్థులు అడిగిందానికి హెడ్మాష్టరు ఏం సమాధానం చెబుతాడా అని టీచర్లంతా ఆదుర్దాగా వరండాలో నిలబడి కిటికీ సందుల్లో నుంచి చూడసాగారు.

"మీరు మధ్యాహ్నం బడి పెడితే ఎలా కుదుర్తుంది? మేమంతా కూలినాలి చేసుకునేవాళ్ళం. రెక్కాడితేగానీ డొక్కాడని స్థితి మాది. మధ్యాహ్నం మా పిల్లలి పనుల్లోకి పంపిస్తాం. మీరు వాళ్ళని ఇక్కడ కట్టిపడేయడానికి వీల్లేదు. ఆ బ్రహ్మ దిగివచ్చి చెప్పినా మధ్యాహ్నం మా పిల్లలు బడికి రారు" ముక్తకంఠంతో పలికారంతా.

"కూలివాడి కొడుకు కూలిపనే చాయాలన్న రోజులు పోయాయి. ఇవాళ ప్రతి తండ్రీ తన బిడ్డ బాగా చదువుకోవాలనీ ఉన్నతమైన పదవిలో ఉండాలనీ కోరుకుంటున్నాడు. అందుకు ఎంతైనా ఖర్చు చేయడానికి సిద్ధపడుతున్నాడు. లేకుంటే ఈనాడిన్ని కాన్వెంటు స్కూళ్ళు వెలిసేవి కావు. మీ పిల్లలు. . . మీ ఇష్టం. మీలాగే వాళ్ళూ బతకాలనుకుంటే మధ్యాహ్నం బడికి పంపడం మా నేయండి. అలాకాకుండా మీ పిల్లలు మీకంటే ఉన్నతంగా ఉండాలనుకుంటే నేను చెప్పినట్లు చెయ్యండి. పిల్లలు రాకపోతే మరీ మంచిది. . . . మాకు పనేం ఉండదు. మేము చదువు చెప్పినా చెప్పకున్నా మా జీతాలు మాకు వచ్చేస్తాయి. నష్టపోయేది మీ చిన్నారుల భవిష్యత్తు" అంటూ ఆగాడు వంశీ.

ఆ మాటకు ఆలోచనలోపడ్డారు గ్రామస్థులు. టీచర్సే వాళ్ళని తన మీదకు ఉసిగొలిపారన్న విషయం వంశీకి తెలుసు. అయినా ఎవరిమీదా కోపగించుకోకుండా నిజాల్ని నిర్భయంగా వివరించాడు. ఎన్ని సవాళ్ళనైనా ఎదుర్కొని ఆ స్కూలుని ఒక గాడిలో పెట్టాలన్నదే అతడి ధ్యేయం. మరుచటిరోజు మధ్యాహ్నం స్కూలు పెట్టినా గ్రామస్థుల నుంచి ప్రతిఘటన ఎదురుకాకపోవడంతో అది తన తొలి విజయంగా భావించి ముందుకుసాగాడు వంశీ.

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బడిలో ఆటల పోటీలు జరిగాయి. పిల్లల్లో కొత్త ఉత్సాహం, చురుకుదనం చోటుచేసుకున్నాయి.

రాటకు జాతీయజెండా కడుతూ ఏ రంగు కింద ఉండాలో తెలియక తికమకపడ్డారు డ్రిల్లు మాస్టారు. ఆ విషయం గమనించిన వంశీకి అతడిపై జాలివేసింది.

"పైన కాషాయం, అడుగున ఆకుపచ్చ ఉండాలి. కన్‌ఫ్యూజ్ అవకండి మాస్టారూ" అన్నాడు వంశీ.

జాతీయ జెండాలోని రంగులపై అవగాహనలేని నువ్వు ఈ దేశ పౌరుణ్ణని చెప్పుకోడానికి సిగ్గుపడాలి అన్న భావం స్ఫురిస్తోందతడి మాటల్లో.

తన అజ్ఞానానికి తనే సిగ్గుపడిపోయాడు డ్రిల్లు మాస్టారు. నాటి నుండి ఉపాధ్యాయులు ప్రతి విషయంలో జాగ్రత్తపడసాగారు.

తదనంతరం తనుచేసే కార్యక్రమాలకు గ్రామస్థుల నుండి కూడా సహకారం లభించడంతో వంశీకి ఏనుగంత బలం వచ్చింది. ఏ ఒక్కరి మనసూ నొప్పించకుండా సలహాల రూపంలో ఆదేశాలిస్తూ టీచర్స్ అందరిచేతా పనులు చేయిస్తూ అచిరకాలంలోనే అందరి అభిమానాన్నీ చూరగొన్నాడు. తన కుటుంబ సభ్యులకు ఆ ఊళ్ళో ఉండటం ఇష్టంలేకపోయినా వంశీ అయినవాళ్ళందర్నీ విడిచిపెట్టి బడి పక్కనే నివాసం ఉంటూ మరిన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం స్టాఫ్ అందరికీ స్ఫూర్తినిచ్చింది. ఫలితంగా వాళ్ళలో కూడా అంకితభావం, సేవా దృక్పథం అలవడ్డాయి. వెరసి నేడు ఆ పాఠశాల జిల్లాలోనే ఆదర్శంగా నిలిచింది.

★ ★ ★

అసూయతో వంశీని తక్కువగా అంచనా వేశాను. వాడి అనుభవాలు వాడి నోటితోనే విన్న తర్వాత నాకు కనువిప్పుకలిగింది. మెత్తని గడ్డిమీద నడిచేవాడికి ముళ్ళమీద నడిచేవాడి బాధ ఎలా తెలుస్తుంది? అడు గడుగునా ఎదురయ్యే అడ్డంకుల్ని అధిగమిస్తూ అన్నేసికార్యక్రమాలు చేయడం అంత తేలిక కాదు. హేట్సాఫ్ టు వంశీ! అవార్డుల మీద నాకున్న దురభిప్రాయం పూర్తిగా తొలగిపోయింది. అప్పుడప్పుడు అర్హులకు కూడా అవార్డులొస్తాయి అనడానికి వంశీయే ఉదాహరణ. వందమంది అనర్హులకు అవార్డులొచ్చినా పరవాలేదు కానీ ఒక్క అర్హుడు కూడా అవార్డు కోల్పోకూడదనుకున్నాను. అంతే, అవార్డుగ్రహీతను మనసారా అభినందించి తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యాను.

**(17.4.2005 ఈనాడు ఆదివారం అనుబంధం)**